క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన



నర్సింహులపేట: కొనుగోలు కేంద్రంలో నెల రోజులుకుపైగా ఉంటున్నామని, వర్షాలకు తడిసిన ధాన్యంను కొనుగోలు చేయాలని అడిగితే పట్టించుకోవడం లేదని ముంగిమడుగు ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద శనివారం రైతులు ఆందోళన చేశారు. అకాల వర్షాలకు ధాన్యం మొలకేత్తుతుందన్నారు. నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కాంటా వేసిన బస్తాలను త్వరగా తరలించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో కాంటా వేసి 20 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు తరలించలేదని రైతులు వాపోయారు. రామన్నగూడెం, ముంగిమడుగు, పలు తండాల రైతులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



నెల్లికుదురు: మండలంలోని బోటిమీది తండా గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అందించిన ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో సీసీరోడ్డు పనులు చేపట్టారు. కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు జాటోతు వీరన్న, వీంకుడోతు బిచ్చనాయక్, భద్రు, వెంకన్న, అశోక్ పాల్గొన్నారు.

ఆధునికీకరణ పనులు..

బయ్యారం: మండలంలోని గంధంపల్లి– కొత్తపేట ఊరకుంట ఆధునికీకరణ పనులను శనివారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌నాయక్, సీతారాంరెడ్డి, గోపాల్, వెంకట్రామయ్య, శ్రీను, అన్నపూర్ణ, సురేష్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటమే సీపీఐ లక్ష్యం

గార్ల: ప్రజాసమస్యలే ఎజెండాగా నిత్యం ప్రజల మధ్య ఉంటూ పోరాడే పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రాంపురం గ్రామంలో శనివారం నిర్వహించిన పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశం అనంతరం గ్రామశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాంపురం గ్రామ శాఖ కార్యదర్శిగా సిరిమర్తి నాగరాజు, సహాయ కార్యదర్శిగా గుండా ఉపేందర్‌రెడ్డితోపాటు 11 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. నాగేష్, వీరస్వామి, పాపారావు, శ్రీను నవీన్, ఎల్లయ్య, అమృతమ్మ, రోజా, సామ్రాజ్యం, ప్రభాకర్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

కురవి: సీరోలు మండలంలోని కొత్తూరు(సీ), తాళ్లసంకీస, సీరోలు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీరోలు తహసీల్దార్ పున్నం చందర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల్లో ధాన్యం మొత్తం మిల్లులకు తరలిస్తామని తెలిపారు. అలాగే కురవిలో బోల్తాపడిన ధాన్యం లారీలోని ధాన్యాన్ని వేరే లారీలో పంపించినట్లు తెలిపారు.

న్యాయ విచారణ జరపాలి

తొర్రూరు: సీపీఐ(ఎంఎల్)మావోయిస్టు పార్టీ అఖిలభారత కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చే న్యాయ విచారణ జరపాలని తొర్రూరులో తొర్రూరు మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, సీపీఎం మండల కార్యదర్శి ఎండీ యాకుబ్, బందు మహేందర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఆలకుంట్ల సాయిలు డిమాండ్ చేశారు. తొర్రూరులో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి మంజంపల్లి వీరన్న, సీపీఐ నాయకులు అశోక్, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, వెంకన్న, మురళి, మంగళ్లపల్లి రామస్వామి, దిండిమిటి రవి పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఎన్నిక

మహబూబాబాద్ రూరల్: జిల్లా ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం ఎన్నిక తమకు తెలియకుండా ఏర్పాటు చేసుకున్నారని గిరిజన ఎస్టీ (లంబాడ) న్యాయవాదుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య మోహన్ నాయక్, ప్రధాన కార్యదర్శి బానోత్ లాలునాయక్, కోశాధికారి కొర్రా మున్న నాయక్, మహిళా కార్యదర్శి గుగులోత్ సునీత శనివారం తెలిపారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం కార్యవర్గం ఎన్నిక ఎస్టీ లంబాడ న్యాయవాదుల కార్యవర్గం సమక్షంలో జరగలేదన్నారు. గిరిజన ఎస్టీ (లంబాడ) న్యాయవాదుల సమాఖ్య ఉపాధ్యక్షులుగా ఉన్న బానోత్ బాలాజీ సంఘం నిర్ణయాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాడని, ఆయనను ఆ పదవి నుంచి బహిష్కరిస్తున్నామని తెలిపారు. సమావేశంలో న్యాయవాదులు బాదావత్ చక్రర్తి, బానోత్ సుమన్, జర్పుల సురేష్, భూక్య సురేష్, మోహన్ చంద్, నాగేశ్వరరావు, సతీష్, భూక్య గుశాల్, ప్రవీణ్, బానోత్ భాస్కర్ పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న కళ

- జానపదాల్లో 'చిందు'కు ప్రత్యేక స్థానం
- యక్షగానంతో ఆకట్టుకుంటున్న కళాకారులు



భాగవత నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు(ఫైల్)

పెద్దవంగర: చిందు యక్షగానం ఒక ప్రాచీన తెలుగు జానపద కళారూపం. తెలంగాణ జానపదాల్లో చిందు ప్రత్యేకమైనది. ఒకప్పుడు పల్లెల్లో వెలుగొందిన కళారూపమిది. మహాభారతం, రామాయణం, భాగవతాలను ఇతివృత్తంగా చేసుకొని కథలు చెబుతారు. సామాజిక కళలో ఒకటైన చిందు భాగవతాలు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం ఏదో ఒక గ్రామంలో ఈ కళను కళాకారులు ప్రదర్శిస్తుండగా.. ఈ తరం యువత, చిన్నారులు వింతగా వీక్షిస్తుండగా.. పెద్దవారు ఆసకిగా చూస్తూ ఆనందిస్తున్నారు.

యక్షగానం అంటే..

చిందు యక్షగానం అనే కళారూపం తెలంగాణలో తెలంగాణలో ప్రసిద్ధి చెందింది. చిందు అంటే 'గెంతు, దుమకు' అని అర్థం. కాగా ఈ కళాప్రదర్శనలో కళాకారులు ఎక్కువగా గెంతుతూ, దుముకుతూ ప్రదర్శిస్తారు. ఎక్కువగా నాటక రూపంలో ప్రదర్శిస్తుంటారు. నృత్యం, సంగీతం, సంభాషలు, వేషధారణ, రంగస్థలం వంటి పద్ధతుల సమ్మేళనంతో సాగుతోంది. పూర్వం ఈ ప్రదర్శనలు ఎక్కువగా సాగుతుండేవి. రాత్రంతా తెల్లవారు జాము వరకు గ్రామాల్లోని చెట్లకింద, ప్రధాన కూడళ్లలో జరిగేవి.

కళాకారుల ప్రతిభ అద్భుతం..

ఒకసారి సరిగ్గా రాకపోతే మళ్లీ చిత్రీకరించడానికి సినిమా కాదు. షాట్ విరామంలో దుస్తులు మార్చుకునేందుకు వీలుండదు. గ్రామాల్లో వందలాది మంది ప్రేక్షకుల కళ్లెదుట వారిని మెప్పించేలా ప్రదర్శ ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకోసం అభినయంలోనే కాదు పద్యాల పదజాలాలతో చెప్పడానికి ఎంతో శ్రమించాలి. రాత్రంతా జరిగే ప్రదర్శనకు వేదిక, దుస్తులు, ఆభరణాలకు ఎంతో నగదు వెచ్చిడంమే కాక నెలల తరబడి సాధన చేసేవారు. ఎందరో కళాకారులు చిందు కళాకారులు భాగవంతాలతో జనాన్ని మెప్పించి అద్భుత ప్రదర్శనలు ఇచి ప్రజల చేత భళా అనిపించుకునేవారు.

ఆదరణ తగ్గిన చిందు భాగవతాలు..

ఆధునిక వినోద సాధనాల రాకతో ప్రజలు యక్షగానాలపై ఆసక్తిని కోల్పోతున్నారు. సినిమా, టీవీ, ఇంటర్‌నెట్ వంటివి అందుబాటులోకి వచ్చాక జానపద కళారూపాలకు పేక్షకులు తగ్గిపోతున్నారు. కొత్త తరాలు ఈ కళను నేర్చుకోవడానికి.. ముందుకు తీసుకెళ్లడానికి ఆసక్తి చూపకపోవడంతో దీనికి ప్రాముఖ్యత తగ్గుతోంది. కళాకారులకు ఆర్థిక రాబడి లేకపోవడంతో ఇతర వృత్తులవైపు వెళ్తున్నారు. దీతో కళను కొనసాగించే కళాకారులకు తగ్గిపోతున్నారు. తగు శిక్షణ, ప్రదర్శన అవకాశాలు కల్పించాలని చిందు కళాకారులు కోరుతున్నారు. యక్షగానం గురించి పలు వేదికల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి కనుమరుగవుతున్న నాటి ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని విద్యావంతులు, మేధావులు పేర్కొంటున్నారు.

కళనే నమ్ముకున్నాం..



మేము చిందు కళను నమ్మకొని జీవిస్తున్నాం. మండలంలోని అవుతాపురం గ్రామంలో ప్రస్తుతం భాగవతాలు వేస్తున్నాం. మాకు వంశపర్యంపరంగా ఈ కళనే జీవన ఆధారం. మేము బతికి ఉన్నత కాలం ఈ కళతో జీవిస్తాం. ఈ రంగంలో సంతృప్తిగా కొనసాగుతున్న.

– గద్దం శ్రీనివాస్, చిందు కళాకారుడు

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్



ఎమ్మెల్యే, డీఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్/పెద్దవంగర/దోర్నకల్/నెల్లికుదురు/ మరిపెడ/ గూడూరు/ కేసముద్రం: కాంగ్రెస్ ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రత్యేక సాంకేతిక శిక్షణ అందిస్తుందని ఉపాధ్యాయులు ఈ శిక్షణతో అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే భూక్య మురళినాయక్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎంఈఓలు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈక్రమంలో జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్ టీచర్ల చేతుల్లో ఉందని, తెలిపారు. అనంతరం డీఈఓ రవీందర్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఏసీజీ శ్రీరాములు, డీఎస్ఓ అప్పారావు, క్వాలిటీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆజాద్, పూర్ణచందర్, సంతోష్, సతీష్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపు

మహబూబాబాద్ రూరల్ : పంటల సాగుకు ముందుగా పచ్చిరొట్ట ఎరువులను సాగుచేయడంతో భూసారం పెరుగుతుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం మహబూబాబాద్ పట్టణంలోని రైతువేదికలో శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పచ్చిరొట్టతో పంటలకు మేలు కలుగుతుందన్నారు. డీఏఓ విజయనిర్మల, ఉద్యాన అధికారి మరియన్న, ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు, టెక్నికల్ ఏఓ రాజు, ఏఓలు తిరుపతిరెడ్డి, వెంకన్న, అబ్దుల్ మాలిక్, వంశీ, రాంబాబు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ చరిత్రాత్మకం



తొర్రూరు: ర్యాలీలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు

- మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు

తొర్రూరు: ఆపరేషన్ సిందూర్ విజయం చరిత్రాత్మకమని మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ పెహల్గాం వద్ద హిందువులపై ఉగ్రవాదుల దాడుల తర్వాత ప్రధాని భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చి ఒక్క రాత్రిలో పాకిస్తాన్‌లో ఉన్న 9 ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయడం హర్షనీయమని తెలిపారు. నాయకులు సొడ రమేష్, లేగా రాంమోహన్‌రెడ్డి, పూసాల శ్రీమాన్, గాదె రాంబాబు, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, కుమార్, రాజేష్, రాంబాబు, ఝాన్సీ, రవిబాబు, భాస్కర్‌నాయక్, మహేందర్ పాల్గొన్నారు.

టీచర్ల హర్షం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ ముగిసిన తర్వాత శనివారం భారత్ ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై టీచర్లు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో సైనికులకు సంఘీభావం తెలియజేశారు. డీఈఓ రవీందర్ రెడ్డి, గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జవాన్‌కు గౌరవ వందనం

బయ్యారం: బయ్యారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతుల వద్ద ఎంఈఓ దేవేంద్రాచారి, ఉపాధ్యాయులు శనివారం జవాన్‌ను సన్మానించారు.

కేసు నమోదు

గూడూరు: ఓ మహిళకు తరచూ ఫోన్ చేస్తూ వేధిస్తున్న ఓ వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కొల్లాపురం గ్రామానికి చెందిన నీలం గౌతమికి అదే గ్రామానికి చెందిన మట్టపల్లి నవనీత్‌రావు ఫోన్ చేస్తూ వేధిస్తున్నాడు. వేధింపులు భరించలేక ఈ నెల 17వ తేదీన గౌతమి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స అనంతరం విషయాన్ని భర్తకు చెప్పుకుంది. దీంతో నవనీత్‌రావుపై ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇదిలాఉండగా.. కొల్లాపురం గ్రామానికి చెందిన నవనీత్‌రావు ఊర్లోకి వెళ్తుండగా.. నిమ్మలబోయిన వెంకన్న.. నవనీత్‌రావును ఆపి.. నీ వల్లనే గౌతమి ఆత్మహత్యాయత్నం చేసిందంటూ ఇనుపరాడ్‌తో కొట్టాడు. నీలం రమేష్, నీలం సైదులు, నీలం సతీష్, గుడిసె సంతోష్ సైతం నవనీత్‌రావుపై దాడికి పాల్పడగా నవనీత్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలుడిపై కుక్కదాడి

కేసముద్రం: కుక్కదాడిలో ఓ బాలుడికి గాయాలైన ఘటన మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని కిష్టాపురం కాలనీకి చెందిన సయ్యద్ ఇస్మాయిల్ తన కుమారుడు సయ్యద్ మునీర్‌అహ్మద్‌తో కలిసి రాత్రి మజీద్‌కు వెళ్లి వస్తుండగా కుక్క మునీర్ అహ్మద్‌ను కరవడంతో గాయమైంది.

విత్తన డీలర్లు లైసెన్స్ కలిగిఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాస్

కొత్తగూడ: విత్తన డీలర్లు లైసెన్స్‌లు తప్పకుండా కలిగి ఉండాలని ఏడీఏ అజ్మీర శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రైతువేదికలో కొత్తగూడ, గంగారం మండలాల విత్తన ఎరువుల డీలర్లకు అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్ బుక్స్, స్టాక్ రిజిష్టర్, స్టాక్‌బోర్డు, ధరల పట్టికలను విధిగా అప్‌డేట్ చేయాలన్నారు. విక్రయాలు చేసిన తర్వాత రైతులకు బిల్స్ ఇవ్వాలని, ప్రతీ నెల 5వ తేదీలోపు విక్రయ వివరాలను ఏఓలకు అందించాలన్నారు. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఓలు జక్కుల ఉదయ్, రాజు, తహసీల్దార్ రాజు, ఎస్సై కుశకుమార్, విస్తరణ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్ రెడ్డి

దంతాలపల్లి: రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ భారత రాజ్యాంగ మూలసూత్రాలకు విఘాతం కలిగిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఉద్యమించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. దంతాలపల్లిలో నిర్వహించిన ఆ పార్టీ మూడో మండల మహాసమావేశంలో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11 సంవత్సరాలుగా కేంద్రంలో పాలన చేస్తున్న బీజేపీ.. గవర్నర్, రాష్ట్రపతి లాంటి అత్యున్న పదవులను, తమ స్వార్థ ప్రయోజనాలకోసం ప్రతిపక్ష పార్టీలను నిర్వీర్యం చేయాలని కుట్రలు పన్నుతుందన్నారు. సమావేశంలో మండల కన్వీనర్‌గా బి.రాజశేఖర్‌తోపాటు ఐదుగురు నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నాయకులు యాకసాయిలు, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, రామచంద్రు, కోటి, జనార్దన్ పాల్గొన్నారు.

నిర్మాణానికి అనుమతి ఎందుకివ్వరు..?

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



బాత్‌రూంలోని సామగ్రిని చూపుతున్న వెంకటేశ్వర్లు

కురవి: మండలంలోని బలపాల శివారు లింగ్యా తండా గ్రామానికి చెందిన భూక్య మంగీలాల్ ఇంటి నిర్మాణానికి ఎందుకు అనుమతి ఇవ్వరని.. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అధికారులను ప్రశ్నించారు. ఇంటి నిర్మాణాన్ని కొందరు వ్యక్తులు అడ్డుకుంటున్నారనే కారణంతో బీజేపీ జిల్లా నాయకులు శనివారం బాధితుడి ఇంటి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాతల నుంచి నివాసం ఉంటున్న స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకుంటున్న మంగీలాల్‌కు పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓ, ఎంపీఓ, డీపీఓలు ఎందుకు అనుమతి ఇవ్వడంలేదని ప్రశ్నించారు. అమాయక గిరిజనుడి ఇంటి నిర్మాణానికి పర్మిషన్ ఇవ్వకపోవడంతో బాత్‌రూం, మరుగుదొడ్డిలో సామాగ్రి పెట్టుకుని ఉండాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. డీపీఓకు ఫోన్ చేస్తే స్పందించడంలేదని తెలిపారు. ఈ విషయమై జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య కిషన్ నాయక్, నాయకులు చీకటి మహేష్‌గౌడ్, గద్దం అశోక్, పల్లె సందీప్, జాటోత్ వీరన్న, బుడిగె భద్రసేనాగౌడ్, కోడి రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ నవ్య

చిన్నగూడూరు: రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకే విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'విద్యుత్ శాఖ – పొలం బాట' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చిన్నగూడూరు విద్యుత్ శాఖ ఏఈ నవ్య తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చిన్నగూడూరు సెక్షన్ పరిధిలోని చిన్నగూడూరు, ఉగ్గంపల్లి, మంగోరిగూడెం గ్రామాల రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈ నవ్య మాట్లాడుతూ... రైతులు వ్యవసాయ మోటార్ల స్టార్టర్ల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వలనే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రైతులు బావుల వద్ద ఉన్న మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవడం ద్వారా నాణ్యమైన విద్యుత్ అందడమే కాకుండా మోటార్లు కాలిపోకుండా ఉంటాయని తెలిపారు. రైతులు పంటపొలాల రక్షణకు విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకోవడం అత్యంత ప్రమాదకరమని సూచించారు. అనంతరం సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 100కేవీఏ(02నెం.), 63కేవీఏ(02నెం.), 25కేవీఏ(02నెం.), 15కేవీఏ(01నెం.) కొత్త డీటీఆర్‌లను మార్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ జహూర్ పాషా, విద్యుత్ సిబ్బంది క్రాంతి, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

సంఘం ఎన్నికలు నిర్వహించాలి

బొల్లం అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

నెహ్రూసెంటర్: గొర్రెలు, మేకల సహకార సంఘం గ్రామ సొసైటీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని, ప్రతి మండలానికి శాశ్వత పశువైద్యులను నియమించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సొసైటీ సమావేశంలో అయన మాట్లాడారు. గ్రామాల్లో సొసైటీ ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల రక్షణకు పశు వైద్యులను నియమించాలని, పశు సంవర్ధక శాఖకు నిధులు కేటాయించి సరిపడ మందులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మహబూబాబాద్ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి అశోక్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా దేవనబోయిన మల్లేష్, అధ్యక్షుడిగా గంద్రకోటి కుమార్, ప్రధాన కార్యదర్శిగా సురేందర్, ఉపాధ్యక్షులుగా అమడగాని రఘు, లింగయ్య, రాములు, మురళీ, సహాయ కార్యదర్శిగా శ్రీను, నవీన్, కోశాధికారిగా ఎడ్ల శ్రీను, సలహాదారులుగా శ్రీను, మహేష్, వెంకన్న ఎన్నికయ్యారని తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

కమిటీల ఎన్నిక

కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండలాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల నూతన కమిటీ ఎన్నిక సమావేశం శనివారం మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రం జెడ్పీ హైస్కూల్‌లో జరిగింది. ఈ మేరకు కేసముద్రం మండల అధ్యక్షుడిగా కళ్లెం వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి బానోత్ దేవ్‌సింగ్, ఇనుగుర్తి మండల అధ్యక్షుడిగా లూనావత్ శరత్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ వీరన్న ఎన్నికయ్యారు. కార్యక్రమంలో హరినాథ్, ప్రమీల, రత్నశేఖర్, వీరన్న, ఓంజీ, నెహ్రూ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన కామ్రేడ్ గునిగంటి బుచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ శనివారం మండలంలోని గుండంరాజుపల్లిలో బుచ్చయ్య నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. అనంతరం వారి కుమారులు సీపీఎం జిల్లా కార్యదర్శి గునిగంటి రాజన్న, జిల్లా నాయకులు జగన్, జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కమలాకర్‌లను పరామర్శించారు.

పంపిణీకి సిద్ధంగా జీలుగ విత్తనాలు

డోర్నకల్: రైతులకు అవసరమైన జీలుగ, జనుము విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంతోపాటు గొల్లచర్ల సొసైటీలో జీలుగ, జనుము విత్తనాలు 50 శాతం సబ్సిడీతో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకంతోపాటు ఆధార్ కార్డుతో ఏఈఓలను కలిసి కూపన్ తీసుకుని జీలుగ విత్తనాలను పొందాలని సూచించారు.

తహసీల్దార్‌కు సన్మానం

బయ్యారం: నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగరాజును శనివారం పలువురు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముసలయ్య, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్లు మల్లయ్య, కేతమల్లు, నాయకులు వీరన్న, లింగయ్య, సంపత్, అశోక్, శ్రీను పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

కురవి: సీరోలు మండలం రేకులతండా ఆకేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆర్ఐ యాకూబ్ పాషా శనివారం తెలిపారు. రెండు ట్రాక్టర్లకు రూ.10 వేల జరిమానా విధించినట్లు ఆయన వివరించారు.

మాటేడు యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

తొర్రూరు రూరల్: మండలంలోని మాటేడు గ్రామ యూత్ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ శనివారం తెలిపారు. నూతన అధ్యక్షుడిగా బుర్ర సురేష్‌తోపాటు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని నియమించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సైతం పోటీ చేసేందుకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు నలమాస మహేష్, యాకయ్య, దీనేష్, రాములు, సుమన్, సురేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యం అందించాలి

మహబూబాబాద్: అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టుల కుటుంబాలకు ప్రైవేట్ దవాఖానాల్లో వైద్యం ఉచితంగా అందించాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందచేశారు. అనంతరం నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. చాలా మంది జర్నలిస్టులకు వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత వైద్యం ద్వారా మేలు జరుగుతుందన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

కేసముద్రం: ఈజీఎస్ రక్షణ కోసం, ఈనెల 30వ తేదీన చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొడిశాల వెంకన్న అన్నారు. శనివారం మండలంలోని అర్పనపల్లి, ఇంటికన్నె గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాన్ని ఆ సంఘం నాయకులు సందర్శించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఏడాదికి 200 రోజులు పనులు కల్పించి, రోజు వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు నీరుటి జలేందర్, మిట్టగడుపుల వెంకన్న, శ్రీను, రాజు, ముత్తయ్య, ఉపేందర్, బద్యా, గోపియా పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మూడు ద్విచక్ర వాహనాల అపహరణ కేసులో ఇద్దరికి ఏడాది జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా, మరొకరికి ఏడాది జైలుశిక్ష రూ.30 వేలు జరిమానా విధిస్తూ మహబూబాబాద్ ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ స్వాతిమురారి శనివారం తీర్పుఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్, కోర్టు డ్యూటీ అధికారి బీరం సంపత్ రెడ్డి, మరో కోర్టు డ్యూటీ అధికారి కానిస్టేబుల్ మాడె రాంబాబు వివరాలు వెల్లడించారు. అప్పటి ఎస్సై భీమారెడ్డి, ప్రస్తుత టౌన్ ఎస్సై విజయ్ కుమార్ వేర్వేరుగా కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు పూర్తి చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలత ప్రాసిక్యూషన్ పక్షాన వాదించారు.

విద్యుదాఘాతంలో 3 పాడిగేదెల మృతి

గార్ల: విద్యుదాఘాతంతో 3 పాడిగేదెలు మృతి చెందిన ఘటన శనివారం పాతపోచారం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పాత పోచారం గ్రామానికి చెందిన ముగ్గురు రైతుల పాడిగేదెలను ఉదయాన్నే మేతకు వదిలారు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ రైతు తన బెండతోట చుట్టూర ఫెన్సింగ్ చేసి రాత్రి సమయంలో పశువులు రాకుండా విద్యుత్ సరఫరా ఇచ్చి వెళ్లిపోయాడు. ఉదయాన్నే మేతకోసం బెండతోట వద్దకు వచ్చిన 3 గేదెలు ప్రమాదవశాత్తు ఫెన్సింగ్ వైరుకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. గేదెల విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు.

సాలార్ తండాలో..

మహబూబాబాద్ రూరల్ : విద్యుదాఘాతంతో పాడిగేదె మృతిచెందిన ఘటన మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని సాలార్ తండాలో శనివారం చోటుచేసుకుంది. తండాకు చెందిన పాల్తియా గంగ తన పశువులను మేత కోసం వదిలిపెట్టగా ఓ పాడిగేదె విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడింది. రూ.70 వేలు నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు.


ప్రమాదవశాత్తు ఆవు..

గార్ల: అప్పసముద్రం చెరువు కట్ట కింద శనివారం గుర్తుతెలియని ఆవు మృతిచెందింది. విద్యుదాఘాతం లేదా పాముకాటుతో మృతిచెంది ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

ధాన్యం లోడ్ లారీ బోల్తా

కురవి: ధాన్యం లోడుతో వస్తున్న లారీ బోల్తా పడిన సంఘటన కురవి మండల కేంద్రం శివారు ఏకలవ్య మోడల్ పాఠశాల వద్ద ఖమ్మం జాతీయ రహదారి మూలమలుపులో శనివారం జరిగింది. లారీ డ్రైవర్ రోశయ్య కథనం ప్రకారం.. సీరోలు మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి లారీలో ధాన్యాన్ని లోడ్ చేసుకుని కేసముద్రంలోని రైస్‌మిల్లుకు వెళ్తున్న క్రమంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల మూలమలుపు వద్ద డీసీఎం వాహనాన్ని తప్పించే క్రమంలో గ్రానైట్ లారీ వెనుక నుంచి మీదకు రావడంతో లారీ రోడ్డు పక్కకు వచ్చే క్రమంలో కల్వర్టును ఢీకొట్టి బోల్తాపడ్డట్లు తెలిపారు. లారీ డ్రైవర్ రోశయ్యకు తలకు గాయమవడంతో 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. కురవి పీఎస్సై కృష్ణారెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. శుభకార్యానికి వెళ్లే డీసీఎంను తప్పించేక్రమంలో లారీ పక్కకు ఒరగడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తనిఖీ చేస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్లు

మరిపెడ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మరో ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మీనారాయణతో కలిసి తనిఖీ చేశారు. సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. దోమల నిర్మూలన, సీజనల్ వ్యాధులపై తగిన సలహాలు సూచనలు చేశారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు మురుగు కాలువల్లో నీరు నిల్వకుండా చూడాలన్నారు. మురుగు నీరు ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, సూపర్‌వైజర్ మంగమ్మ, ఏఎన్ఎంలు పద్మ, రాములమ్మ, ఆశాలు పాల్గొన్నారు.